# నిజమైన పుత్రుడు



దీపావళి
కథలపోటీలో
బహుమతి రు.600
పొందిన కథ

**"శ్రీరామచంద్ర పరబ్రహ్మణే నమః" - అంటూ చొరవగా ఆ డాబా యింట్లో అడుగు పెట్టాడు వెంకటపతి, ఆ రోజు వుదయం.**

"అన్నయ్యగారా ! .... వస్తున్నాను కూర్చోండి" - ఎన్నో సంవత్సరాలుగా పరిచయం వున్న స్వరం కాబట్టి వచ్చింది వెంకటపతి అని ఇట్టే గుర్తుపట్టి, లోపల్నించి బయటికి తొంగి చూడకుండానే పలికింది జానకమ్మ. ఆ వెనకే ఏమిటో ఆత్రత అణచుకోలేనట్లు ఇవతలికి వచ్చేసింది కూడా.

"ఊరు నుంచి ఎప్పుడు వచ్చారు అన్నయ్యగారూ ? .. కృష్ణమూర్తి, కోడలు అంతా కుశాలమేనా ?"

"ఆ అంతా కులాసాగానే వున్నారమ్మా"

"ప్రతిరోజూ వుదయం పూట మీరు క్రమం తప్పకుండా ఈ ఇంటికి రావడం, ఏవో మంచిచెడులు మాట్లాడుకోవటం బాగా అలవాటైపోయింది అన్నయ్యగారూ. అటువంటి మీరు వూరు వెళ్ళారు. అప్పట్నుంచీ నాకేమిటో వెలితి, అసంతృప్తి .."

"అంతా నీ అభిమానం జానకమ్మా"

"మీ మంచితనం కూడా అన్నయ్యగారూ ! . నేను మరిచిపోలేనివి గడిచి

పోయిన రోజులు, వాటికి సంబంధించిన జ్ఞాపకాలనే ... అవి తలుచుకున్నప్పుడల్లా మీరూ నా మనసులో మెదులుతూంటారు... నేను ఈ ఇంటికి వచ్చాక మీరు కనిపించని రోజులేదు ... అసలు మీ అబ్బాయి దగ్గిరే పూర్తిగా వుండిపోతానని చెప్పివెళ్ళిన మీరు పదిరోజులు తిరక్కుండానే తిరిగి వచ్చెయ్యటమేమిటి అన్నయ్యగారూ ?''

''అలా అనే అందరికీ చెప్పివెళ్ళాను. కానీ జానకమ్మా ఆ కొత్త వాతావరణంలో ఇమడలేకపోయాను. అయినా పుట్టి పెరిగినగడ్డ, నమ్ముకున్న వృత్తి - ఇక్కడ వుంటేనే నాకు ఎంతో సంతృప్తిగా వుంటుందమ్మా.''

''అలా అని ? ... జీవితకాలం మొత్తం ఈ యాచక వృత్తిలోనే బ్రతుకుతారా ? ... పుట్టిపెరిగినగడ్డ, నమ్ముకున్న వృత్తి అంటూ ఛాందసాలకు పోయి ప్రయోజనంలేదు అన్నయ్యగారూ. ఎక్కడ నాలుగురోజులు వుంటే అదే మన వూరు ...''

జానకమ్మ మాటలు వింటున్న వెంకటపతి ముఖకవళికల్లో మార్పు పొడసూపింది. అది ఆమె గమనించకూడదని వెంటనే కృత్రిమమైన వుత్సాహాన్ని అనునయించి,

''ఎంతసేపూ నా యోగక్షేమాలే త్రవ్వుతున్నావుగాని మీ యింటి విషయాలు మాత్రం చెప్పటంలేదే జానకమ్మా నువ్వు... ఇంతకూ మీ శేఖరం, కోడలు కనిపించరేం?'' అడిగాడు.

''మా శేఖరం ఆఫీసు పనిమీద హైదరాబాద్ వెళ్లాడు ... ఊళ్ళోనే ఇల్లు కద - రెండురోజులు పుట్టింట్లో గడిపి వస్తానని వెళ్ళింది కోడలు.''

''నీ ఆరోగ్యం అదీ బావుంటోందా ?''

''నా ఆరోగ్యానికేం అన్నయ్యగారూ, నిక్షేపంలా వుంటేను! అయినా మా శేఖరం నాకు ఏ రోగం రొప్పు లేకుండానే మధ్య మధ్య డాక్టరుతో పరీక్ష చేయించి నా ప్రాణాలు తోడేస్తున్నాడంటే నమ్మండి. కోడలు కూడా వాడికే వత్తాసు పలుకుతోంది.''

''బుద్ధిమంతుడైన కొడుకు, సలక్షణమైన కోడలు - భాగ్యమంటే నీదే జానకమ్మా.''

ఆ పొగడ్తకు మురిసిపోయిన జానకమ్మ, ''అన్నట్లు అన్నయ్యగారూ, మన మాటల మధ్య మీకు ప్రొద్దెక్కిపోవటంలా! మా ఒక్క ఇంటి దగ్గిరే గంటలతరబడి వుండిపోతే మీకు భుక్తి ఎట్లా గడుస్తుంది ?... ఉండండి... వస్తాను'' అంటూ లోపలికి వెళ్ళింది.

గర్మం తీసుకొని రోడ్డుమీదికి వచ్చి వెనక్కు తిరిగి ఆ యింటిని, ఎవరో ఆప్త బంధువుకు వీడ్కోలు చెబుతున్నట్లు డాబా వరండాలో నిలబడివున్న జానకమ్మను ఒక్కసారి చూసి తిరిగి ముందుకు నడవటం మొదలుపెట్టాడు వెంకటపతి.

ఏమిటో ఆ యింటికీ, తనకు అనుబంధం! సంవత్సరాలకు సంవత్సరాలే గడిచిపోతున్నా అది పెనవేసుకొని అలాగే వుండిపోయింది.

అడుగులు ముందుకు పడుతుంటే ఆలోచనలు వెనక్కు మళ్ళుతున్నయ్ వెంకటపతికి.

దాదాపు ఇరవై సంవత్సరాల క్రిందటి మాట...

ఒక రోజున వెంకటపతి తన వృత్తి ధర్మం నిర్వహిస్తూ ఇదే బజారున నడుస్తూండగా, ''పంతులుగారూ, ఇలా రండి'' అన్న పిలుపు వినిపించింది ఒక పెంకుటింట్లోంచీ.

క్రిందటి రోజువరకు ఖాళీగా వుండనుకున్న ఇంట్లోంచే పిలుపు రావటంతో, 'ఇందులోనూ ఎవరో ప్రవేశించారన్నమాట. శుభం.' అనుకొంటూ సంకోచించకుండానే వెళ్ళాడు వెంకటపతి అక్కడికి.

పిలిచిన స్త్రీ — మాట మంతి లేకుండానే లోపలికి వెళ్ళి పళ్ళెంలో బియ్యం పోసి తెచ్చి అతడి జోలెలో పోసింది, ''ఈ బజారుకు వచ్చినప్పుడు మరిచిపోకుండా ఇక్కడికీ వస్తూండండేం ?'' అంటూ. అంతే. అప్పుడు మరెలాంటి సంభాషణకూ అవకాశం ఇవ్వలేదు. ఆమె దాతృత్వాన్ని మనసులోనే పొగుడుకుంటూ ఆ యింటినుంచీ వచ్చేశాడు వెంకటపతి. అంతేకాదు. అది మొదలు ఆనవాయితీగా అక్కడికి వెళ్తూనేవున్నాడు అతడు.

ఈలోగా ఆమెను గురించి నలుగురూ రకరకాలుగా చెప్పుకోవటం విన్నాడు వెంకటపతి... ఊళ్ళో కొంచెం ఆస్తిపాస్తులు కలవాడుగా పేరుబడ్డ నిరంజనరావు ఆమెను ఎక్కణ్ణుంచో లేవదీసుకొచ్చాడట. పేరు జానకి. అయిదేళ్ళ కొడుకు కూడా వున్నాడు... 'ఎంత సిగ్గుమాలింది కాకపోతే డబ్బుకు ఆశపడి ఇట్లా లేచివస్తుంది !' అడంగులు ముక్కున వేలేసుకున్నారు, అబ్బురంగా చెప్పుకొని. ఒకరిద్దరు పెద్దలు, ''ఎంత యాచకవృత్తిలో వున్నా నాలుగు బియ్యపు గింజలకు ఆశపడి ఆ నీతి, జాతి లేని దానింటికి నువ్వు వెళ్ళటం మాకేం నచ్చలేదు'' అని వెంకటపతితోనూ అన్నారు. కానీ, పట్టించుకోలేదు అతడు.

రోజులిలా గడుస్తూండగానే ఒకనాడు, ''మీ పేరు అడగాలనుకొని ఎప్పటికప్పుడు మరిచిపోతున్నాను. అభ్యంతరం లేకపోతే చెప్పండి.'' అంది జానకి.

''నన్ను వెంకటపతి అంటారమ్మా'' మామూలుగానే చెప్పాడు.

''వెంకటపతి అన్నయ్యగారూ ! ఊళ్ళో నలుగురూ నన్ను గురించి నాలుగు రకాలుగా అనుకుంటున్నారు. నాకు తెలుసు. అందరితో పాటే మీరూ నన్ను వెలివేసినట్లు చూస్తారా ఇక ?''

''అలా మిమ్మల్ని చూడాలనుకొనే పక్షంలో ఈ యింటి గడప తొక్కేవాణ్ణే కాదు.''

''సంతోషం అన్నయ్యగారూ... కాకపోతే నేను వయోవరంగా మీకంటే చిన్నదాన్ని. కాబట్టి మీరు ఏకవచన సంబోధన చేస్తేనే బావుంటుంది నా విషయంలో.''

''అలాగేనమ్మా.''

దాంతో ఉప్పొంగిపోయిన జానకి లోపలికి వెళ్ళి కాఫీ తెచ్చి మొహమాటంతో వద్దని మొత్తుకుంటున్న వెంకటపతితో దాదాపు బలవంతం చేసి త్రాగించింది. తర్వాత,

''లోకం దృష్టిలో నేను చేసింది తప్పే అన్నయ్యగారూ... కానీ, నా వరకు నేను మంచి పనే చేశానని తృప్తి పడుతున్నాను... కట్టుకున్న భర్త అకస్మాత్తుగా పోయాడు. ఏవో మూఢనమ్మకాలను అడ్డుపెట్టుకొని అత్తమామ నా ఆలీగతీ పట్టించుకోవటం మానేశారు. దాంతో నేను కర్తవ్యం గురించి ఆలోచించవలసిన పరిస్థితి ఏర్పడింది... ఈలోగా అదృష్టవశాత్తు ఆ గర్భశ్రీమంతుడైన నిరంజనరావుగారు తారసపడ్డారు. పుట్టింట్లో పేదరికం — ఆ నరకయాతన అనుభవించలేక, ఎక్కడికైనా వెళ్ళి వుద్యోగంలో చేరి స్వేచ్ఛగ బ్రతుకుదామని నా బిడ్డను తీసుకొని ఇంటిదగ్గిర బయలుదేరిన నాకు, రోడ్డు దగ్గిరకి వచ్చేసరికి బస్ దొరకలేదు. కొంతసేపటికి నిరంజనరావుగారి కారు అటుగా వచ్చింది. నన్ను, నా బిడ్డను చూసి ఆయనంతట ఆయనే దాన్ని ఆపుచేశారు. సందేహించకుండానే ఎక్కి కారులో కూర్చున్నాను... నేనిలా నిరంజనరావుగార్ని ఆకట్టుకొని వచ్చింది సుఖభోగాలలో తేలిపోవటానికి కాదండీ — నా బిడ్డ బంగారు భవిష్యత్తును



గురించి! ఆయన కూడా శేఖర్‌ను తన బిడ్డలతో సమానంగా చూసుకొని విద్యా బుద్ధులు నేర్పిస్తానని వాగ్దానం చేశారు. నిరంజనరావుగారే కనుక 'నీ బిడ్డ సంగతి నాకు అనవసరం' అని అనివుంటే నేనిలా రావటం జరిగేదే కాదు'' అంటూ తన దీనగాథను చెప్పింది.

''ప్రతి మనిషికీ తన మనస్సే తనకు సాక్ష్యం... లోకులు పలుకాకులు. వాళ్ళ మాటలు పట్టించుకోవటం అనవసరం జానకమ్మా'' — తనకు తోచిన రెండు మాటలూ అని ధర్మం తీసుకొని వచ్చేశాడు ఆవేళ్టికి, వెంకటపతి.

మరొక రోజు ఏవో మాటల సందర్భంలో అడిగింది జానకి —

''పౌరోహిత్యం చేయకుండా యాచక వృత్తిలోకి దిగారేం అన్నయ్యగారూ ? దాని కంటే ఇదే లాభసాటా ?''

''లేదమ్మా. మా తండ్రిగారు గతించ టంతో చిన్నతనంలోనే కుటుంబ భారం నామీద పడింది. అయినా ఒక గురువుగారి దగ్గిర చేరాను స్మార్తం నేర్చుకుందామని... ఏమిటో... విద్య పూర్తిగా నేర్చుకోలేక పోయాను... వచ్చీరాని పాండిత్యంతో లోకాన్ని మోసం చేయటం ఇష్టంలేక చివరికి ఈ వృత్తిలోనే వుండిపోయాను.''

''మీరు మరీ అంత నిజాయితీతో వుంటే ఎలా అన్నయ్యగారూ ? ... నాలుగు డబ్బులు సంపాదించుకోవాలంటే ... ''

''డబ్బును గురించి ఆత్మవంచన చేసుకో లేనమ్మా.''

వెంకటపతి అలా ఖండితంగా చెప్పాక మరెప్పుడూ ఆ ప్రస్తావన తేలేదు జానకి.

ఇంకోరోజు ''మీ కృష్ణమూర్తిని ఒకసారి మా యింటికి తీసుకు రండి అన్నయ్యగారూ'' అంది జానకి, తనకూ ఒక్కడే కొడుకనీ, పేరు కృష్ణమూర్తనీ వెంకటపతి చెప్పిన మీదట. అలాగే చేశాడు అతడు. శేఖర్, కృష్ణమూర్తుల వయసు దాదాపు ఒకటే ... వెంకటపతి భార్య సంవత్సరం క్రిందటే పోయిందనీ, ప్రస్తుతం కృష్ణమూర్తి తల్లి లేని పిల్లవాడనీ — అతడంటే ఎంతో జాలి, అభిమానం జానకికి.

కొన్ని సంవత్సరాలు గడిచిపోయాయి. ఈలోగా నిరంజనంగారు ఆ పెంకుటింటిని పడగొట్టించి దానిస్థానే డాబా కట్టించారు. జానకి పేర కొంత సొమ్మును బ్యాంకులో వేశారు. అలా చేయమని ఆమే చెప్పింది తన బిడ్డభవిష్యత్తుకోసం. తర్వాత అనుకోకుండ గుండెపోటు వచ్చి కన్నుమూశారు ఆయన.

* * *

''నమస్కారం అయ్యగోరూ! ... తమరు నిన్ననే వచ్చారంట వూరునుంచీ. ఇందాక మా ఆడది చెప్పింది లెగండి'' — అంటూ వచ్చాడు రంగయ్య.

''నమస్కారం ... ఏం రంగయ్యా, కులాసా ?'' అప్పుడే వంట ప్రయత్నంలో పడ్డ వెంకటపతి ఇవతలికి వచ్చాడు.

''కులాసాయేనండి ... రాత్రి బండేశాను. బేరాలు బాగున్నయ్ ... అందుకే ఈయాళ ఇప్పటిదాకా బండిని వదిలిపెట్టలేదు.''

''సంపాదనతోపాటు ఆరోగ్యం కూడా కొంచెం జాగ్రత్తగా చూసుకుంటూ వుండు రంగయ్యా.''

''ఆట్టాగేనండీ...సరేగాని అయ్యగోరూ, తమరు పూర్తిగా అబ్బాయిగారి దగ్గిరేవుండి పోతానని చెప్పేర్నారు కద ? మరి అప్పుడే వచ్చేశారు ?''

''అందరికీ అలాగే చెప్పివెళ్ళానుమకో ... కానీ, ఆ వూరి నీళ్ళు నాకు బొత్తిగా సరిపడ లేదు రంగయ్యా.''

''నిజమే బాబూ. కొందరికి పొరుగూరు ఎళ్తే అక్కణ్ణీళ్ళు సరిపడవు. నాకూ అను భవమే...మరి అబ్బాయిగారు, కోడలుగారు..''

''అంతాకులాసాగానే ఉన్నారురంగయ్యా.''

''నాక్కావలసింది అదే బాబూ ... రాత్రంతా నిద్దర్లేదు ... కాస్తంత కూడు తిని పడుకోవాలి ... వస్తాను అయ్యగారూ'' వచ్చిన దారినే వెళ్ళాడు రంగయ్య.

వెంకటపతి వుంటున్న ఇంటి ప్రక్కఖాళీ స్థలంలో పాక వేసుకొని కాపురం వుంటు న్నాడు రంగయ్య. రిక్షా తొక్కి జీవనం చేస్తున్నాడు అతడు.

రంగయ్య వచ్చి వెళ్ళిన దిక్కే చూస్తూ కాసేపు నిలబడిపోయాడు వెంకటపతి.

ఇది సమాజం. దీనిలో కుంటుబానికీ కుటుంబానికీ మధ్య అనుబంధం వుంటుంది. మనిషికి మనిషికి మధ్య ఆత్మీయత చోటు చేసుకుంటుంది. ఆ ఆత్మీయతలోంచీ గౌరవం, జాలి, సానుభూతి—ఇత్యాదివి పుట్టుకొస్తాం టాయి. ఇది తన చుట్టూ వున్న, తనకు తెలిసిన సమాజం. కొన్నిచోట్ల ఈ సమాజమే వికృతంగా మారి తోటి మనిషి సాటి మనిషిని పీక్కుతినే సందర్భాలూ వున్నయ్. అది వేరే విషయం.

తన సమాజంలో జానకమ్మలాంటి ఉదార వ్యక్తులు, రంగయ్యలాంటి సాధువర్తనులు వున్నారు. తను మనశ్శాంతి పొందగలిగాడంటే, హాయిగా బ్రతుకుతున్నాడంటే — అది వాళ్ళకు ఎంతో ఆత్మసంతృప్తి! అందుకే అంత యిదిగా అడుగుతున్నారు కన్నకొడుకు దగ్గిర తను గడిపిన జీవితం గురించీ, అక్కడే వుండి పోకుండా వెంటనే తిరుగు ప్రయాణమై రావటం గురించీ... కానీ... కానీ.. ఏమని చెప్పగలడు ?

* * *

తను ఏ పేదరికంవల్ల ఆణగారిపోయాడో, ఏ విద్యావిహీనతలవల్ల ఈ లోకంలో అసమర్థంగా మిగిలిపోయాడో — అవి తన బిడ్డ భవిష్యత్తుకు ప్రతిబంధకాలు కాకూడదని కృష్ణ పుట్టినప్పుడే అనుకున్నాడు వెంకటపతి.

## దీపావళి

ఎద చీకటి పొదరింటికి
మానవతా మతాబులు
మదిలోపలి భావాలను
వెలిగక్కే చిచ్చుబుడ్లు
కాలగమన తీరులోన
విష్ణుచక్ర వింతహేల
కాంతి మహాకరరాసుల
వెలిగక్కే వెన్నముద్ద
చీకటి భావాంధ్రోలు
సీమటపాకాయ మ్రోత
చిరువంతల చీకుపోవ
కాకరపువ్వొత్తి వెలుగు
ప్రాంగణాన ప్రమిదలలో
ఆత్మ తత్వజ్ఞానకళిక
వెలశి మనిషి మనిషిగా
జీవించే అనుభవాల
కళాకేళి
దీపావళి

— పాండ్యశ్రీ

ఆ పదాశయాన్ని దృష్టిలో పెట్టుకొనే భార్య అకస్మాత్తుగా పోయినా,వయసులో వున్నా పునర్వివాహం చేసుకోలేదు. తన సర్వస్వం కృష్ణుడే అనుకొని ఒకటికి నాలుగు పేటలు యాచనకు తిరిగి, అర్ధ కూడు తిని – ఎలాంటి లోటూ రాకుండా కొడుకును చదివించాడు. కృష్ణ కూడా ఎంతో తెలివితేటలు గలవాడు. ప్రతి సంవత్సరం ఫస్ట్ క్లాసులోనే ప్యాసయ్యేడు. అదృష్టం బావుండబట్టి ఈ గడ్డు కాలంలోనూ అతడికి వుద్యోగం దొరికింది... ఇక తన జన్మ చరితార్థమైనట్లేనని భావించుకున్నాడు వెంకటపతి.

ఉద్యోగపు మొదటి నెల జీతంలో కొంత డబ్బు తండ్రికి పంపాడు కృష్ణ. అంతేకాదు. 'నువ్వు ఒక్కడివీ అక్కడ వుండటమేమిటి ? నా దగ్గిరకి వచ్చేయ'మని వుత్తరం కూడా రాశాడు. కొడుకు పంపిన మనియార్డరు గురించీ, వ్రాసిన వుత్తరం గురించీ ఎంత మురిసిపోయాడో ? ఎందరికి ఘనంగా చెప్పుకున్నాడో! కానీ ఆ ఆనందం తాత్కాలికమే అయింది వెంకటపతికి.

# నిజమైన పుత్రుడు

మూడు నెలలు తిరక్కుండానే కృష్ణ దగ్గిరనుంచీ వేరే వుత్తరం వచ్చింది, "నాకు సంబంధం కుదిరింది యిక్కడ. ముహూర్తం కూడా నిశ్చయమైపోయింది నాన్నా. నీవు పెళ్ళి రోజుకు వస్తే చాలు" అంటూ.

ఆ వుత్తరాన్ని చూసుకున్న వెంకటపతి, 'ఒక కొడుకు అహర్నిశలూ తన అభ్యున్నతి కోసమే పాటుబడిన కన్నతండ్రికి యిచ్చే విలువ, గౌరవం యింతేనా ?' అని, కృష్ణ కారణంగా మొదటిసారి బాధపడ్డాడు.

"ఏదోలెండి అన్నయ్యగారూ... వయసులో వున్న కుర్రవాడు. కొంచెం త్వరపడ్డాడు... ఎంతైనా కన్నతండ్రి అన్న గౌరవం లేకపోతే పెళ్ళి రోజుకు అక్కడికి రమ్మని మీకెందుకు వుత్తరం రాస్తాడు చెప్పండి ?" అంటూ విషయం తెలుసుకొని సర్దిచెప్పింది జానకమ్మ.

ఆవిడ మాట ప్రకారమే తన మనసును సర్దిపుచ్చుకొని ముహూర్త సమయానికి కొడుకు వివాహం జరిగే వూరు వెళ్ళాడు వెంకటపతి.

"వచ్చావా నాన్నా!" ఒక చిరునవ్వు చిందించి వూరుకున్నాడు కృష్ణ... తర్వాత స్నేహితులనీ, భార్య తరపు బంధువులనీ – అందరితో నవ్వుతూ, తుళ్ళుతూ మాట్లాడటం తప్పితే తండ్రితో మనసువిప్పి మరొక్క మాటకూడా మాట్లాడలేదు అతడు.

మర్నాడు వుదయమే "నేను వెళ్తున్నాను కృష్ణ" అంటే "సరే నాన్నా. అక్కడ వుండలేను అనిపించినప్పుడు ఇక్కడికి వచ్చెయ్" – ముక్తసరిగా అని వూరుకున్నాడు కృష్ణ. కోడలితో చెబితే "అలాగే వెళ్ళి రండి మామయ్యా" అన్నట్లు తలవూపింది తప్పితే "పరాయివాడిలా అప్పుడే వెళ్ళిపోవటమేమిటి ? మరో నాలుగురోజులపాటు వుండి వెళ్ళండి" అని ఒక్కరూ అనలేదు–కొడుకు విషయంలో రెండోసారి బాధపడ్డాడు వెంకటపతి.

తర్వాత మరెప్పుడూ డబ్బు పంపలేదు కృష్ణ తండ్రికి. ఆ మధ్య ఒక వుత్తరంలో



"నీవు ఒక్కడివీ అక్కడ వుండిపోవటమేమిటి? ఇక్కడికి వచ్చెయ్ నాన్నా" అని వ్రాశాడు. స్వతః బుద్ధిపుట్టిందో, లేక ఎవరైనా చెప్పారో. మరి అతడికి ... ఆ సమయంలో వెంకటపతికి వంట్లో బావుండలేదు కూడా. అదే అదునుగా భావించుకొని వూళ్లో తెలిసిన అందరికీ, "ఉత్తరం వ్రాశాడు. నేను మా అబ్బాయి దగ్గిరికి వెళ్తున్నాను. ఇక అక్కడే వుండిపోవాలనుకుంటున్నాను" అని చెప్పి వెళ్లాడు వెంకటపతి.

అక్కడికి వెళ్ళిన మర్నాడు వుదయం గదిలో కొడుకు, కోడలు మాట్లాడుకొనే మాటలు విన్నాడు.

"మనిద్దరం హాయిగా, స్వేచ్ఛగా బ్రతక్కుండా మధ్యలో మీ నాన్నగారొకరు... నెలకో పాతికో యాభైయ్యో పంపితే మీ వూళ్ళోనే వుండేవారుగా?...అసలు ఇక్కడికే వచ్చెయ్యమని మీరు ఎందుకు వుత్తరం రాశారు మామగారికి ?"

"నువ్విలా ఇబ్బంది ఫీలవుతావని అనుకోలేదు డియర్ ! ... పోనీ, ఆనిక్కి మా ఊరు వెళ్ళిపొమ్మని నాన్నకు చెప్పెయ్యమంటావా?"

"వచ్చింది నిన్ననేకద ? ఈవేళే అలా చెప్పేస్తే బావుంటుందా ?...నాలుగురోజులు పోయాకే చెప్పండి" అని కోడలు అనటం, అందుకు కొడుకు "ఓ. కె." చెప్పటం చెవులారా విని అచేతనంగా ఒకచోట కూలబడిపోయాడు వెంకటపతి.

'వెంటనే వచ్చిన దారి పట్టేస్తే ?' — అనిపించింది. కానీ, ఏదో వివేకం వెంటనే కళ్ళెం బిగించి పట్టింది. 'ఎంత కాదనుకున్నా కృష్ణ తన కొడుకు. ప్రాణంలో ప్రాణంగా పెంచుకున్నాడు వాణ్ణి తను...అలాంటివాడు భార్య మాటకోసం ఏదో అన్నాడని తొందర పడటం పెద్దరికం అనిపించుకోదు...వాళ్ళూ అవకాశం ఇస్తున్నారుకద ? నాలుగురోజుల పాటు వుండి కొడుకు, కోడలు — ల అచ్చట ముచ్చట చూసుకొనిపోతేనే తృప్తిగా వుంటుది.' అని ఆవేశాన్ని అణుచుకొని అక్కడే వుండిపోయాడు వెంకటపతి.

తర్వాత ఒకరోజు "నువ్వు పనిచేసే ఆఫీసు ఎలా వుంటుందో చూడాలని వుందిరా అబ్బాయ్" అని వెంకటపతి అంటే, "సరే. రా నాన్నా నాతోపాటు" అంటూ తన వెంట ఆఫీసుకు తీసుకువెళ్లాడు కృష్ణ.

అదేం చిత్రమో ! అక్కడ అనుకోకుండా ఒక పరిచయస్తుడు కనిపించాడు వెంకటపతికి.

"నమస్కారం పంతులుగారూ ! ఏమిటో పనిమీద వచ్చినట్లున్నారు ?" అడిగాడు అతడు.

"ప్రత్యేకమైన పనేం లేదు ... మా అబ్బాయి కృష్ణమూర్తి పనిచేసే ఆఫీసు ఇదే కదా ? ... "

"ఏమిటీ! కృష్ణమూర్తిగారు మీ అబ్బాయా ! ... మొత్తానికి బిచ్చమెత్తుకొని బ్రతుకుతున్నా కొడుకును బాగానే చదివించారండీ ... మాలాంటి కాంట్రాక్టర్ల బిల్లులు ప్యాసుచేసేది మీ అబ్బాయేనండీ !"

అతడి మాటలు వెంకటపతికి ఎంతో కర్ణపేయంగా తోచాయి. కానీ వాళ్ళ సంభాషణ చెవులారా విన్న కృష్ణ మొహం మాత్రం చిన్నబుచ్చుకొంది.

ఇంటికి వెళ్ళిన తర్వాత, "నువ్వు మా ఆఫీసుకు రాకుండావుంటేనే బాగుండేది నాన్నా" — తండ్రివల్ల ఘోరంగా అవమానం పొందినట్లు ఇదైపోతూ అన్నాడు కృష్ణ. కొడుకు మాటమీద తిరిగి ఆ ఆఫీసు వైపు వెళ్ళనేలేదు వెంకటపతి.

ఈలోగా మరొక సంఘటన —

కృష్ణవాళ్ళుండే ప్రక్క వాటాలోవాళ్ళు తిరుపతి వెళ్ళి వచ్చినట్లు తెలిసింది. వెంకటేశ్వరస్వామి అంటే అమితమైన భక్తి వెంకటపతికి... అలస్యంచేస్తే దొరకదేమోనని ప్రత్యేకించి వాళ్ళ వాటాలోకి వెళ్ళి ప్రసాదం అడిగి తీసుకున్నాడు.

అదొక పెద్ద నేరమైంది కోడలి దృష్టిలో. దానిమీద భర్తకు ఫిర్యాదు చేసింది.


"ఏం నాన్నా, ప్రక్కవాళ్ళ దగ్గిరికి వెళ్ళి ప్రసాదం అడిగావా నువ్వు ?"

"ఊఁ. స్వామివారి ప్రసాదం కద అని అడిగి తీసుకున్నాను."

"ఛీ...ఛీ... అడుక్కుతినే జన్మ ఎత్తినప్పుడు ఆ బుద్ధులు ఎక్కడికి పోతయ్ ?.. అసలు నువ్వు ఇక్కడికి వచ్చింది దేనికి నాన్నా ?... నలుగురిలో నన్ను తల ఎత్తుకొని బ్రతక్కుండా చేయటానికేగా ? ఓ బిచ్చమెత్తుకొని బ్రతికేవాడి కొడుకుగా అందరికీ తెలియజెప్పటమేగా వా గురించి ?"

ఆ క్షణంలో అక్కడికక్కడే ప్రాణం పోయినా బావుండుననిపించింది వెంకటపతికి.

"నువ్వు పరువుగా, గౌరవంగా బ్రతకాలనే కృష్ణా, నిన్ను చదివించింది... అలా అభిప్రాయపడకపోతే చిన్నతనంలోనే ఒక జోలె నీ చంకకు తగిలించి నా వెంట తిరగమనే వాణ్ణి... పోనీలే బాబూ, ఇక్కడ వుండి నిన్ను ఇబ్బంది పెట్టటం నాకు ఇష్టంలేదు.. అందుకే ఈ రోజు — కాదు. ఇప్పుడే వెళ్ళిపోతున్నాను మన వూరు" - వస్తున్న



కన్నీటిని బలవంతానా ఆపుకొంటూ తన చేసంచీని తీసుకొని అక్కణ్ణుంచీ బయలు దేరాడు వెంకటపతి... అంతే...

బిచ్చమెత్తి తను పెట్టిన తిండి తిన్నప్పుడు, తన డబ్బు ఖర్చుపెట్టి చదువు కొనేటప్పుడు ఈ అభిమానం, పరువు ఏమైపోయాయో మరి!... మరొకసారి దుఃఖ వినశుడైయ్యాడు వెంకటపతి.

* * *

వణుకుతున్న చేతులతో శేఖర్ అందించిన కాగితం మడత విప్పాడు వెంకటపతి.

"బాబూ, శేఖర్!

ఇంత కాలానికి నేనొక నిర్ణయానికి వచ్చాను. నా నిర్ణయం — ముఖ్యంగా నీకు తీరని మనస్తాపం కలిగిస్తుంది. నాకు తెలుసు. అయినా కన్నబిడ్డవైన నిన్ను మొదటిసారిగా — ఆఖరుసారిగా బాధ పెట్టక తప్పటంలేదు.


మీ నాన్నగారు పోకముందు నేను కూపస్త మండూకాన్ని. ఆయన పోయాక చుట్టూ వున్న సమాజమే నాకు లోక స్వరూపాన్ని తెలియజెప్పింది... ఒక్కగానొక్క బిడ్డవైన నిన్ను నా జీవిత లక్ష్యంగా తీసుకొని బయటి ప్రపంచంలోకి అడుగుపెట్టాను. నా సంకల్పాన్ని భగవంతుడు మెచ్చినట్లున్నాడు. కాబట్టే పుష్కళంగా ఆస్తిపాస్తులున్న

## నిజమైన పుత్రుడు

నిరంజనరావుగారు నాకు తారసపడటం జరిగింది.

నీకు నా పట్ల అచంచల విశ్వాసం. నిరంజనరావుగారు వుంచుకున్న దానికొడుకుగా వూళ్ళో చలామణి అవుతూ నువ్వెంతటి మనక్లేశాన్ని అనుభవించావో నేను వూహించు కోగలను. అయినా చలించలేదు నువ్వు. నీ పురోభివృద్ధికి నేను పాటుబడితే, చదువును గురించి నీవు ఆరాటపడ్డావు. అన్ని విధాల యోగ్యుడిగా నిలబడ్డావు కనుకే నా కళంకం అడ్డుపడకుండా నీకు వివాహం జరిగింది. కోడలు కూడా బుద్ధిమంతురాలు.

చదువు పూర్తై నువ్వు వుద్యోగంలో చేరిననాడే నేను చనిపోదామనుకున్నాను. నా కారణంగా నీకు వివాహం కాకపోతుందేమోనన్న బెంగ వుంది అప్పుడు ... వివాహం అయ్యాక కోడలితో నీవు సుఖంగా కాపురం చేసు కొంటుంటే నాలుగురోజులు చూశాకే పోదా మనుకున్నాను తర్వాత ... ఇప్పుడు కోడలు గర్భవతి అని తెలిసింది. ఒక కళంకికి కొడుకుగాపుట్టి నీవు మానసికంగా చిత్ర హింస అనుభవించినట్లే రేపు నీ బిడ్డలు 'ఫలానిదాని మనవలు, మనవరాళ్ళు' అని లోకం చెప్పుకొంటుంటే వాళ్ళూ కృంగిపోక




మానరు. అందుకే నేను లేకుండాపోయి, ఉద్యోగం మరో వూరికి మార్పించుకొంటే — మరి నీకు సమస్యే వుండదు. ఆ పనిచెయ్ శేఖర్.

మరొకమాట, ఒకనాడు మనల్ని ఈ లోకం దుమ్మెత్తిపోసినా, సంఘం వెలివేసి నట్లు చూసినా — మనమూ మనుషులమే అని గుర్తించి మసులుకున్న మంచిమనిషి వెంకటపతి మామయ్యగారు. కొడుకు దగ్గరికి వెళ్ళి అక్కడే స్థిరంగా వుండిపోతానని చెప్పి వెళ్ళిన వ్యక్తి పదిరోజులు తిరక్కుండానే తిరిగి వచ్చేశారు. కృష్ణ, అతడి భార్య ఆయన్ని సరిగా చూడలేదేమోనన్నది నా అనుమానం. అన్నయ్యగార్ని అడిగినా బయట పడి చెప్పలేదు. శేఖర్! నువ్వు మాత్రం వెంకటపతి మామయ్యగార్ని పరాయి వ్యక్తిగా కాకుండా ఒక ఆప్తబంధువుగా ఆదరించు. ఇది నా కడసారి కోరిక. మన్నిస్తావుకదూ?

నీ తల్లి,
జానకి."

ఆ వుత్తరం చదివి ఒకచోట కుప్పలా కూలబడిపోయాడు వెంకటపతి ... అలా ఎంతసేపు కూర్చున్నాడో ...

"చదివారా మామయ్యగారూ, అమ్మ వుత్తరం?" — స్మశానానికి వెళ్ళి తల్లికి దహనాదికాలు జరిపించి వచ్చిన శేఖర్ వెంకటపతి ప్రక్కన కూర్చొని అడిగాడు.

దాంతో ఏదో మైకం నుంచీ తేరు కున్నట్లు, "ఉఁ...చదివాను —" అన్నాడు వెంకటపతి.

"తల్లి అయివుండీ కన్నకొడుకునైన నన్ను పూర్తిగా అర్థం చేసుకోలేకపోయిందేమో నండీ మా అమ్మ ... ఆమె నిరంజనరావు గారి పంచన చేరి లోకంలో నిందలుమోసింది. నానా అగచాట్లూ పడింది ... అలా ఎందుకు ఎవర్ని గురించి చేసింది మామయ్యగారూ?... తన కన్నబిడ్డనైన నా గురించే? ... నన్ను పెంచి పెద్దచేసి యోగ్యుడిగా తీర్చిదిద్దిన అమ్మకోసం నేను ఈ సంఘానికే కాదు, ప్రపంచానికి కూడా ఎదురునిలబడగలనండీ! కానీ, ఆమె త్వరపడి నిర్ణయం తీసుకొంది... మా అమ్మ మరి నాకు లేదు మామయ్య గారూ" అంటూ బావురుమని వెంకటపతి వడిలో తల పెట్టుకున్నాడు శేఖర్.

"ఊరుకో శేఖర్... వూరుకో..." అంత వరకే గొంతు పెగిలివచ్చింది వెంకటపతికి.

# వివాహ వేదిక

(ప్రకటనదారులకు క్రొత్త అవకాశం)

రోజు రోజుకు సాంఘిక వ్యవస్థ, వివాహ తీరుతెన్నులు మారుతున్నవి. మారుతున్న ధోరణులకనుగుణంగా వివాహ సంబంధాల గూర్చి తగు సమాచారము సేకరించుటలో క్లిష్టత, త్రిప్పట, వ్యయం అధికమవుతున్నవి.

వధూవరుల కొరకు సమాచారము పత్రిక ద్వారా అందజేసుకోవడం వల్ల కొంత ఈ సమస్యకు పరిష్కారము కాగలదు. ఈ దృష్టితోనే ఆంధ్రపత్రిక (దినపత్రిక)లో వధూవరులను గూర్చిన ఒక ప్రకటనల వేదికను ప్రచురించదలచినాము. మామూలుగా అయ్యే చార్జీలపై 50% రాయితీతో అంటే మామూలు సంగ్రహ ప్రకటనలకు లైనుకు రూ.5లు చార్జీకి బదులు ఈ ప్రత్యేక కాలంలో లైనుకు రు 2-50 వంతున చార్జీ వుంటుంది. (లైనులో సుమారు 15-16 అక్షరములు ఇమడగలవు) నాలుగు లైన్లకు తక్కువ లేకుండా ప్రకటన వుండాలి.

మీ ప్రకటన విషయము + చార్జీలను మని ఆర్డరు/డ్రాఫ్టు ద్వారా జతపరచి (బాక్స్ నెంబరు కోరేవారు అదనంగా రూ.5లు చెల్లించాలి)

**ఆంధ్రపత్రిక**

గాంధీనగరం, విజయవాడ-3

లేదా

బషీర్ బాగ్, హైదరాబాద్-29కు

పంపవచ్చును.




## నిజమైన పుత్రుడు

కొంతసేపటి తర్వాత శేఖర్ తనంతట తానే తేరుకొని, "మామయ్యగారూ! అమ్మ కడసారి కోర్కె తెలుసుకున్నారుగా?... ఇక మీరు మాతోపాటు యిక్కడే వుండిపోండి" అన్నాడు.

"అదెలా?... నాకు వేరే ఇల్లు వుందిగా బాబూ... అయినా రోజూ మీ యింటికి వస్తూనేవుంటాను... అంతగా నాకు చేతగాని రోజు వస్తే నీ మాట ప్రకారమే చేస్తాను. నాకు మా కృష్ణయినా, నువ్వైనా—ఇద్దరూ ఒకటే శేఖర్" ఏదో పై మాటగా అనేశాడు వెంకటపతి.

లోలోపల మాత్రం — "శేఖర్! తల్లి కళంకి అని లోకం కోడై కూసినా చలించలేదు నువ్వు. నీ అభ్యున్నతి కోసం పాటుబడిందన్న విశ్వాసంతో ఆమెను గురించి ఈ లోకాన్నే ఎదిరించి నిలబడాలనుకున్నావ్... ఇప్పుడు ఆ తల్లి పోయినందుకు భూమాత బ్రద్దలయ్యేలా రోధిస్తున్నావ్. అమ్మ కావాలని పరితపిస్తున్నావ్. ఇక మా కృష్ణ—ఏ వృత్తి అయితే వాడికి నీడనిచ్చి, విద్యాబుద్ధులు నేర్పించి — ఈనాడు ఒక వుద్యోగస్తుణ్ణి చేసిందో ఆ వృత్తిని, దాన్ని స్వీకరించిన పాపానికి నన్ను అసహ్యించుకుంటున్నాడు. నాగరికత ముసుగులో పెంచి పెద్దచేసిన చేతుల్ని తృణీకరించినవాడికి ఒక తల్లికిగాని, తండ్రికిగాని కొడుకుగా నిలబడే అర్హత వుంటుందా? పుత్రుడివంటే నీవే శేఖరం... నీవే" అంటూ ఘోషిస్తున్న వెంకటపతి కుడిచెయ్యి వెళ్ళి శేఖర్ వీపును ఆప్యాయంగా నిమిరింది. ●


ఆంధ్రపత్రిక

దినపత్రికలో

* మన సినిమాలు
* ప్రేక్షకుల తీర్పు

శీర్షికలు

చూస్తున్నారా?